కథ

ఆ రాత్రంతా అంజిబాబుకు నిద్రపట్టలేదు. మస్తిష్కంలో ఆలోచనలు సముద్ర కెరటాల్లా అల్లరి పెడుతున్నాయి. మనసును కుదుటపరుచుకుందామని ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. మనిషి మనసులోనే సముద్రాలున్నాయంటే అబద్ధం కాదేమోనని పించింది, అంజిబాబుకు.

తాత్కాలిక జీవితం

ఉపద్రష్టసాయి

ఇప్పుడేం చెయ్యడం. సరిగ్గా ముప్పై రోజుల తర్వాత, తొమ్మిది సంవత్సరాలు ఉద్యోగం చేసిన తను మళ్ళీ నిరుద్యోగి కాబోతున్నాడు. ఆ విషయం ఆ రోజు మధ్యాహ్నం తనకు తెలిసినప్పుడు అది నిజం కాదేమో నను కున్నాడు. కానీ సాయంత్రం మేనేజర్ తనను పిల్చి, సానుభూతి వచనాలు మాట్లాడుతూ ఆఖరికి ఆ ఉత్తరం తన చేతిలో పెట్టినప్పుడు తను విన్నది అబద్ధం కాదని తెలిసింది అంజిబాబుకు.

ఆ క్షణంలో అంజిబాబుకు గుండె ఆగినంత పనైంది. కళ్ళు బైర్లు కమ్మాయి. ఉన్న ఫళాన ఎంతో నీరసించి పోయాడు. తన ఉద్యోగం శాశ్వతమైనదనుకున్నాడు. కాదు ... తనుతన కన్ఫర్మేషన్ ఉత్తరం వచ్చిన రోజు, తొమ్మిది సంవత్సరాల క్రితం అలా అనుకున్నాడు. అనుకున్నట్లే ఇన్ని సంవత్సరాలుగా ఏ ఒడు దుడుకులూ లేకుండా ఉద్యోగం చేస్తున్నాడు. కాకపోతే గత కొద్ది కాలం నుంచి తను పని చేస్తున్న ఆఫీసులో కొందరిని రిట్రెంచ్ చేస్తారని విన్నాడు కానీ తనుకూడా ఆ గొడ్డలి వేటుకు బలవుతానని అంజిబాబు అనుకోలేదు. తన ఉద్యోగం శాశ్వత మైందని ఎన్నో పథకాలు తయారు చేసుకున్నాడు. ముఖ్యంగా ఆరు సంవత్సరాల క్రితం పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలను కన్నాడు. వాళ్ళిప్పుడు బళ్ళోకి వెళ్తున్నారు కూడా. జీవిత భీమా పథకం తీసుకుని నెలకు రెండు వందల రూపాయలు ప్రీమియం కడుతున్నాడు.

తన జీవితంలో ఏనాడూ ఆదా చేసు కోలేక పోయినా స్వల్ప అప్పుతో గౌరవంగానే బ్రతుకు తున్నాడు అంజిబాబు. ఆ అప్పు కూడా తండ్రి పోయినప్పుడు కార్యాలు చెయ్యడానికి తీసుకున్నది. అప్పుడు జరిగిన ఖర్చులన్నీ తనే భరించ వలసింది అంజిబాబుకు. అన్నలిద్దరూ అంతంత మాత్రం కూడా ఖర్చు పెట్టలేదు. ఏవో కష్టాలు ఏ కరువు పెట్టి ఎక్కడైనా అప్పు తెస్తే అప్పటికి సర్దుకుని తర్వాత అప్పు తీర్చడానికి డబ్బు పంపిస్తా మన్నారు. వాళ్ళ మాటలు నమ్మి అంజిబాబు అప్పు చేశాడు. ఆ అప్పుతో బాటు భార్యకు తను చేయించిన రెండు బంగారు గాజులూ అమ్మాడు. కానీ ఆ అప్పు మాత్రం అలాగే మిగిలి పోయింది. వడ్డీ మాత్రం కడుతున్నాడు క్రమంగా.

ఇక మిగిలింది ఒక చెల్లెలు.

తండ్రి పోతూ పోతూ "ఒరేయ్ అంజీ! సుశీలను నీ చేతిలో పెట్టి పోతున్నానురా... నీ అన్నల మీద నాకు నమ్మకం లేదు. నా దగ్గర డబ్బంతా నీ ముగ్గురు అక్కల పెళ్ళిళ్ళకు ఖర్చైపోయింది. ఇప్పుడు నా అంత్యక్రియలకు కూడ నా దగ్గర డబ్బేమీ లేదు... నిన్నిలా వదిలివెళ్ళి పోతున్నందుకు బాధ పడుతున్నాను రా..." అంటూ కళ్ళు మూశాడు.

సుశీల పెళ్ళి బాధ్యత అంజిబాబు మీద పడింది. దాంతో అంతో ఇంతో అవసరాలకు పెట్టుకునే ఖర్చులు కూడా తగ్గించాడు అంజిబాబు.

ఇంతలోనే ఈ అవాంతరంవచ్చి పడింది.

నెల జీత గాడికి నాలుగు రోజులు జీతం రావడానికి ఆలస్యమైతేనే కష్టపడే రోజుల్లో ఉన్న ఫళాన నీ ఉద్యోగం పోతుందని చెప్తే అంతకన్నా పెద్ద 'షాక్' ఏముంటుంది.

నెల తిరిగి ఒకటో తారీఖు వస్తే ఇంటి అద్దె నుంచి పాల ఖర్చు, నెచ్చాల ఖర్చు, బడి జీతాల, ఒకటా రెండా ... అన్నీ ఖర్చులే! జీతం వచ్చిన రెండు మూడు రోజుల్లోనే నెలాఖరై పోతుంది, మధ్య తరగతి జీతగాడి ఇంట్లో, ఈ లక్షణంలో ఉద్యోగం పోతే ... ప్రావిడెంట్ ఫండ్ వగైరాలు ఎంతో కొంత వచ్చినా అవి ఎంత కాలం ఆదుకుంటాయి. మళ్ళీ ఉద్యోగం ఎప్పుడు దొరుకుతుందో? అసలు దొరుకుతుందో లేదో, మళ్ళీ ఎవరి కాళ్ళు పట్టుకోవాలో లేక ఎంత లంచం పోయాలో... తీరా అలా పోసి చేరినా ఆ ఉద్యోగం శాశ్వతంగా వుంటుందో లేదో...

అంజిబాబు జీవితం తొమ్మిది సంవత్సరాల తర్వాత మొదటికి వచ్చింది. ఎన్నో కష్టాలు పడి డిగ్రీ చదువు కున్నాడు. మరెన్నో కష్టాలు పడి ఉద్యోగం సంపాదించు కున్నాడు. కానీ ఆ ఉద్యోగంలో వస్తున్న జీతం తక్కువగా వుందని అంతకన్నా కొంచెం ఎక్కువ జీతం ఇచ్చే ఒక అంతర్జాతీయ సంస్థలో చేరాడు. అలా చేరినప్పుడు అందరూ అంజిబాబును అదృష్ట వంతుడన్నారు. పొగిడారు. రెండు మూడు సంవత్సరాల తర్వాత "ఫరవా లేదు ... ఉద్యోగంలో నిలద్రొక్కు కుంటు న్నాడు" అనుకున్న అంజిబాబు తండ్రి కోరిక మేరకు పెళ్లి చేసుకున్నాడు. తల్లి, సుశీల పుట్టినరెండు సంవత్సరాలకేపోయింది. అక్కలే తనను, సుశీలను పెంచారు.

తన ఉద్యోగం పోయిందన్న సంగతి భార్యకు తెలిస్తే తన కన్నా ఎక్కువ బాధపడుతుంది. భారతికి ఖర్చులంటే భయం. చేతిలో డబ్బు లేక పోతే తెగ బాధపడిపోతుంది. నెలాఖరు వచ్చే సరికి భారతికి భయం పెరుగుతుంది. ఒక్కొక్కప్పుడు అంజిబాబు డబ్బు కోసం కష్టపడుతున్నా తన కష్టాన్ని భార్యకు చెప్పేవాడు కాదు. తన కష్టం తెలిస్తే భారతి మరింత నీరస పడి పోవడమే కాక, "నేను కూడా నలుగురు పిల్లలకు ప్రైవేట్ చెప్తానండీ" అనో లేక "అప్పడాలు వత్తుతాననో" చెప్పి తన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి ప్రయత్నిస్తుంది. కేవలం అవసరానికి నాలుగు రూపాయలు లేనందుకే అంత బాధపడిపోయే భారతి మరిప్పుడు శాశ్వతంగా తన ఉద్యోగం పోయిందంటే తట్టుకో గలదా? ఎందుకైనా మంచిది ఈ విషయం భారతికి చెప్పకుండా దాచాలి. ఈ నెల రోజుల్లో ఎక్కడైనా మరో ఉద్యోగానికి ప్రయత్నించి, ఆ ఉద్యోగంలో చేరిం తర్వాత మెల్లగా నిజం చెప్పాలి భారతికి. లేకపోతే... గోడవే. పైగా సుశీల భవిష్యత్తేమిటి? అని కూడా భారతి బాధపడుతుంది. తన పిల్లల గురించి కన్నా.

ఆలోచనల వత్తిడికి అలసి పోయిన అంజిబాబు మెదడు కాసింత విశ్రాంతి కావాలను కుందేమో, అంజిబాబుకు మగతగా నిద్ర పట్టింది. మరికొంత సేపటికి గాఢ నిదురలో మునిగిపోయాడు.

** ** **

ఉదయం ఏడు గంటలైంది.

"ఏమండి ... లేవండి ... త్వరగా లేవండి ..." అంటూ భుజాన్ని పట్టుకుని గట్టిగా కుదుపుతున్న భారతి కదుపుకు ఠపీమని లేచి "ఏమైందేమిటి ... అంత కంగారుగా లేపుతున్నావు?" అడిగాడు అంజిబాబు; భయ పడుతూ.

భారతి మొహంలో ఏదో కంగారు చోటు చేసుకుంది. మనిషి భయపడుతూంది కూడా. "ఏమైందే" గద్దించి అడిగాడు అంజిబాబు.

"మీ స్నేహితుడు సుందరం... స్కూటర్ ప్రమాదంలో మరణించాడట... చూడండి పేపర్లో వచ్చింది." అంటూ దిన పత్రిక చూపించింది భారతి. అంజిబాబు ఆత్రుతతో పేపరు చూశాడు. తను పని చేస్తున్న సంస్థ పేరుకూడా వుండడంతో ఆ సుందరం తన ఫ్రెండే, సహ ఉద్యోగి సుందరమేనని నిర్ధారణ అయింది. ఆ వార్త చేదు నిజమే అయినా అంజిబాబు నమ్మలేక పోయాడు. కొన్ని నిజాలు నమ్మలేకపోయినవే అయినా నమ్మక తప్పదు.

సుందరం తన కన్నా ఏడాది ముందు తను పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థలో చేరాడు. తరువాత అంజిబాబు చేరాడు. ఏడాది వ్యత్యాసంతో సుందరం తర్వాత చేరిన వాళ్ళలో అంజిబాబు సీనియర్. కానీ అంజిబాబుతో బాటు ఇంకా ఇద్దర్ని రిట్రెంచ్ చేయుడానికి నిర్ణయించినప్పుడు సుందరం అంజిబాబుతో "అంజీ! మనం పని చేస్తున్న ఈ సంస్థ తాత్కాలిక సంస్థ. అందులో మనం శాశ్వత ఉద్యోగులం. ఈ సంస్థ పది, పదిహేను సంవత్సరాల తర్వాత ఉండక పోవచ్చు. కనుక తాత్కాలిక సంస్థ ల్లోని శాశ్వత ఉద్యోగుల ఉద్యోగాలు తాత్కాలికం కాక శాశ్వతం వుంటాయా.

కనుకబాధపడకుండా బ్రతుకు బాట వెతుక్కోడానికి ప్రయత్నించు. నా సహాయం నీకెప్పుడూ వుంటుంది" అన్నాడు.

ఆ మాటలు గుర్తుకు తెచ్చుకుని అంజిబాబు "పాపం! సుందరం ఇరవై నాలుగు గంటల కన్నా తక్కువ వ్యవధిలో తనకు ఓదార్పు నిచ్చి ధైర్యం చెప్పాడు. అలా చెప్తూ ఒక జీవన సత్యం కూడా సెలవిచ్చాడు" అనుకున్నాడు.

"మనమంతాతాత్కాలిక సంస్థల్లో శాశ్వత ఉద్యోగులం" నిజానికి మనిషి జీవితం ఈ ప్రపంచం అనే శాశ్వత సంస్థలో తాత్కాలిక ఉద్యోగం వంటిదే. కానీ మనిషి తను శాశ్వతంగా వుంటాననే భ్రమతో బ్రతుకు తాడు. అప్పుడప్పుడు అంజిబాబు లాంటి వాళ్ళ రిట్రెంచ్ మెంట్లు, సుందరం లాంటి వాళ్ళ అకాల మరణాలు ఆ భ్రమనుంచి మనిషిని బయటికి లాగుతాయి.

సుందరం అంత్యక్రియలు అయ్యే వరకు సుందరం ఇంట్లోనే వుండి సాయంత్రం ఎంతో విచారంగా ఇంటికి వచ్చాడు అంజిబాబు.

ఇరవై నాలు గ్గంటల వ్యవధిలో రెండు షాక్‌లు భరించిన అంజిబాబు రోజులు లెక్కపెడుతూ, తన ఉద్యోగం తాలూకు నిజాన్ని తనలోనే దాచుకుంటూ గడుపు తున్నాడు.

సరిగ్గా ఇంకా నలభై ఎనిమిది గంటలలో అంజి బాబుకు ఆ సంస్థకూ రుణం తీరి పోతుందనే సమయంలో మేనేజర్ గదిలోకి పిలుపు రావడంతో సెటిల్మెంట్‌కు కబురు వచ్చిందను కుంటూ లేచాడు అంజిబాబు సీట్లోంచి.

మెల్లగా మేనేజర్ గదిలోకి వెళ్ళిన అంజిబాబును కూర్చోమని సైగ చేసి తన టేబిల్ మీదున్న కవరు అతని చేతిలో పెట్టాడు మేనేజర్. ఆ కవరును రెండు చేతులతో పుచ్చుకుని.

"థ్యాంక్యూ సర్! ఈ కవరు తొమ్మిది సంవత్సరాల నా అనుబంధాన్ని తెంచ డానికి ప్రయత్నించినా నేను మాత్రం నా అనుబంధాన్ని తెంచుకోలేదు సార్. మీరంతా ఎప్పుడూ నా వాళ్ళే ... నేనెక్కడున్నా... మీ ప్రోత్సాహంతో గత మూడు సంవత్సరాలలో రెండు ప్రమోషన్లు సంపాదించాను. అందుకు మీకెంతో రుణపడ్డాను కూడా. నన్ను భవిష్యత్తులో కూడా మీ ఆశీస్సులే ముందుకు నడిపిస్తాయనే నమ్మకం నాకుంది సార్" అన్నాడు అంజిబాబు.

అతని మాటలను శాంతంగా విన్న మేనేజర్ "అంజిబాబు! నువ్వు పొరబాటు పడు తున్నావు. ఆ కవరు తెరిచి చూడు" అన్నాడు.

ఆ మాటలకు అంజిబాబు వెంటనే "కవర్ తెరిచి లోపలున్న ఉత్తరం బయటకు తీసి చదువుకున్నాడు.

ఉత్తరం పూర్తిగా చదివిన తర్వాత చలనం లేకుండా కూర్చున్న అంజిబాబుతో "అంజిబాబూ! ఎవరినుదుట రాతఎలాగుంటుందో ఎవరు చెప్పగలరు. ఎల్లుండి నుంచి నిన్ను సర్వీసులోంచి తీసేయాలని ఆర్డరు జారీ చేసినా, హఠాత్తుగా సుందరం చనిపోవడంతో ఆ స్థానాన్ని నీ తొమ్మిది సంవత్సరాల సీనియారిటీ ప్రకారం నీకే ఇవ్వాల్సి వచ్చింది. సుందరం బతికే వుంటే నువ్వు రిట్రెంచ్ అయ్యుండే వాడివి. అతని మరణం వల్ల నీకు మంచి జరిగింది. కానీ ఈ మంచి వెనుక ఒక ఉత్తమ సంస్కారి మరణం దాగుంది. ఎనీ వే బెస్ట్ ఆఫ్ లక్" అన్నారు మేనేజర్.

మేనేజర్ గది నుంచి బయటికి వచ్చి తన సీట్లో కూర్చున్న అంజిబాబుకు ఎదురుగుండా తన సీట్లో సుందరం కూర్చుని తనకేసే చూస్తున్నట్లు కనిపించాడు.

"పాపం! సుందరం తను శాశ్వతంగా ఉద్యోగంలో వున్నా జీవితంలో తాత్కాలికంగా వుండి పోయాడు" అనుకున్నాడు అంజిబాబు.

212

5/5/91